క్లుప్తంగా

10న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



రేవిడి పీహెచ్‌సీలో నులి పురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: నులిపురుగుల నివారణలో భాగంగా మండలంలోని రేవిడి పీహెచ్‌సీలో సోమవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి స్వప్న, రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోన రమణ, కర్రి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు కుర్చీల వితరణ



జూనియర్ కళాశాలకు కుర్చీలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సోమవారం పూర్వ విద్యార్థులు 10 కుర్చీలు అందజేశారు. ప్రిన్సిపాల్ సిహెచ్.సూర్యప్రసాద్‌ను కలిసి వాటిని అందించారు. పూర్వ విద్యార్థులు పి.ఎస్.చంద్, ఎం.ఆర్.కె.రామకృష్ణ, ప్రసాద్, గుప్తా పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్మికులు పద్మనాభం స్టేషన్‌కు తరలింపు



పద్మనాభం పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన జీవీఎంసీ కార్మికులు

పద్మనాభం: విశాఖ నగరంలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా సోమవారం ధర్నా చేసిన 38 మంది జీవీఎంసీ కార్మికులను అరెస్ట్ చేసి పద్మనాభం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరిలో 36 మంది మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. దీనికి నిరసనగా వారంతా పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. మ,ధ్యాహ్నం 2 గంటలకు తీసుకొచ్చి సాయంత్రం 6.30 గంటలకు కార్మికులను విడిచిపెట్టారు.

మణిపూర్ మారణ హోమానికి బీజేపీయే కారణం



కొమ్మాది జంక్షన్ వద్ద ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: మణిపూర్‌లో రెండు తెగలు మధ్య మారణ హోమానికి కేంద్రంలోని బీజేపీయే కారణమని సీపీఐ విశాఖ జిల్లా నాయకురాలు ఎండీ బేగం ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కొమ్మాది, మధురవాడ జంక్షన్ పరిసర ప్రాంతాలలో బాధితులకు సంఘీభావంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఏరియా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుండగులకు సహాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నారు.

చంద్రబాబును రాష్ట్రం నుంచి బహిష్కరించాలి





తగరపువలస అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మధురవాడ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన

- పుంగనూరు ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం
- భారీగా నిరసన ప్రదర్శనలు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు ఈ నెల 4న పుంగనూరు పర్యటన పేరుతో మారణహోమం సృష్టించడానికి ప్రయత్నించారని భీమిలి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. తద్వారా ప్రభుత్వాన్ని కూల్చి, లబ్ధి పొందాలనుకున్న ఆయనను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని నినాదాలు చేశారు. చంద్రబాబు కుట్రను నిరసిస్తూ భీమిలి జోన్, మూడు మండలాల నాయకులు అంబేడ్కర్ కూడలి నుంచి బైపాస్ రోడ్డు వరకు సోమవారం ర్యాలీ, ధర్నా, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ జీవితమంతా వివాదాలమయమేన్నారు. పుంగనూరులో టీడీపీ అల్లరిమూకలను పోలీసులపై ఉసిగొల్పిన చంద్రబాబు.. రాళ్లు, మద్యం బాటిళ్లు, కర్రలతో అమానుషంగా దాడులు చేయించారన్నారు. రాష్ట్రంలో తరచూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చంద్రబాబు చేస్తున్న కుయుక్తులను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. వయసు పెరగడంతో పాటు బుద్ధి మందగిస్తున్న ఆయన రాజకీయాలకు అనర్హుడన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చంద్రబాబు వటి నీచ రాజకీయ ప్రబుద్ధులను ఇంటికి పంపించి రాష్ట్రాన్ని రక్షించుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల, వార్డు అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యం, కోరాడ లక్ష్మణ, జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, మజ్జి వెంకటరావు, అల్లిపల్లి నరసింగరావు, సరగడ రఘునాథరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, సీనియర్ నాయకులు జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, శిల్లా వంశీరెడ్డి, చిప్పాడ వెంకటేష్, చిల్ల సూర్యనారాయణరెడ్డి, కేపీ సత్యనారాయణ, పిన్నింటి వెంకటరమణ, జీవీ నారాయణ, ఉప్పాడ నాగేశ్వరరావు, కుంచా శివరామకృష్ణ, చింతగుంట శివ, పొట్నూరు చంద్రశేఖర్, తమ్మిన కూర్మారావు, కోరాడ అప్పలస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

5, 6,7, 8 వార్డుల నాయకుల ఆధ్వర్యంలో..

మధురవాడ: పుంగనూరులో రక్షక భటులపైనే దాడికి పురికొల్పిన బాబు అండ్ కో పై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. పుంగనూరు ఘటనపై జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లోని వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ దళిత సంఘాల నాయకుడు సియాద్రి కనకరాజు, మధురవాడ మాజీ సర్పంచ్ కుడితి రామారావు మాట్లాడుతూ 40ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు రూట్ మ్యాప్‌కి విరుద్ధంగా యాత్ర చేయడమే కాకుండా, విధ్వంస రచనకు ముందే ప్లాన్ చేశారన్నారు. ముందుగానే కర్రలు, రాళ్లు, మద్యం సీసాలతో కిరాయి మూకలను, గూండాలను వెంట తెచ్చుకుని పోలీసులపై కూడా దాడి చేసి, పోలీస్ వాహనాలను సైతం తగలబెట్టారన్నారు. వ్యవస్థపై దాడిచేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు తదితరులు మాట్లాడుతూ చంద్రబాబుపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా బ్యానర్లు, నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో 5వ వార్డు వివిధ విభాగాల నాయకులు ముచ్చు రామారావు, బోయి సూర్రెడ్డి, జ్యోతిష్, 6వ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ పోతిన ప్రసాద్, పోతిన ఎల్లాజీ, వరలక్ష్మి, 7, 8 వార్డుల నాయకులు చెట్టుపల్లి గోపి, పిళ్లా సూరిబాబు, పాపారావు, డాక్టర్ సూర్యనారాయణ, అల్లాడ లింగేశ్వరరావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణకు అడ్డుకట్ట



పార్కు స్థలంలో వేసిన పాకను తొలగిస్తున్న సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీ

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధి 6వ వార్డు రేవళ్లపాలెం శ్మశానవాటిక– గాయత్రి వుమన్స్ కాలేజీని ఆనుకుని ఉన్న 1.11 ఎకరాల స్థలాన్ని ఆక్రమించేందుకు వేసిన ప్లాన్‌ను జీవీఎంసీ సిబ్బంది సోమవారం మధ్యాహ్నం భగ్నం చేశారు. రేవళ్లపాలెంను ఆనుకుని నివాసాల మధ్య ఉన్న లేఅవుట్‌లో కోట్లు విలువ చేసేస్థలం ఉంది. గతంలో కొందరు వ్యక్తులు ఆక్రమణకు ప్రయత్నిస్తే సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినా కబ్జాకు మళ్లీ పక్కా ప్రణాళిక రచించారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి నవోదయ సమీపంలో, నగరంపాలెంలో ఉన్న కొందరిని పురమాయించి ఇక్కడ హెచ్చరిక బోర్డు మాయం చేసి పాక వేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ప్లానింగ్ సెక్రటరీ కె.అశోక్ సిబ్బందితో వచ్చి పాకను కూల్చివేశారు. ఇక్కడ ఆక్రమణకు ప్రయత్నించిన వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, ప్రభుత్వ భూమి పరిరక్షణకు తక్షణమే అన్ని రకాల చర్యలు చేపడతామని టీపీవో వరప్రసాద్ తెలిపారు.

50 మంది మందుబాబులపై కేసు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ రోడ్డుతో పాటు పలు చోట్ల ఆదివారం రాత్రి బహిరంగంగా మద్యం సేవిస్తున్న 50 మందిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ డీ.రమేష్ తెలిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాత్రి 10 నుంచి 2 గంటల మధ్య బీచ్ వద్ద, బీచ్ రోడ్డులోను బహిరంగంగా మద్యం సేవించి హల్‌చల్ చేశారని, వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. కొంత మంది కుటుంబ సభ్యులు పిల్లల పుట్టిన రోజు వేడుకను బీచ్ వద్ద నిర్వహించడానికి రాత్రి 12 గంటల సమయంలో వస్తున్నారని, ఇది సరికాదన్నారు.

ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయం



ఆరోగ్య మిత్ర దీప్తికి ప్రశంసాపత్రం, నగదు పురస్కారం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, డాక్టర్ రాజేష్

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఉత్తమ సేవలందించిన ఆరోగ్య మిత్రలకు సేవా ఆరోగ్య మిత్రగా గుర్తించి ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. ప్రతి నెలా ఒక్కరిని ఎంపిక చేసి ప్రశంసాపత్రంతోపాటు నగదు పురస్కారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

జూన్ నెలకు గానూ గీతం ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్ర చిప్పాడ దీప్తికి ప్రశంసాపత్రంతోపాటు రూ.5 వేల నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.వి.వి.ఎస్.ఎన్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహనకు చిత్ర ప్రదర్శన

తగరపువలస: రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిస్తూ అంబేడ్కర్ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం సాయంత్రం చిత్రాలను ప్రదర్శించారు. నగరం నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసిన తెరపై వీటిని ప్రదర్శించారు. నగరంలోని వివిధ కూడళ్లలో జరిగిన ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, సీసీ పుటేజీల ద్వారా సేకరించిన వాటిని ఇందులో ప్రదర్శించారు.

వ్యాపారులు రోడ్డు ఆక్రమిస్తే కఠిన చర్యలు



పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేయడానికి మళ్లీ ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం హెచ్చరించారు. ఇక్కడ గంట స్తంభం సమీపంలోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు పళ్లు, కాయగూరలు, చిన్నవస్తువుల అమ్మకాలను సాగిస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనిపై స్పందించిన జెడ్సీ రాము కొద్ది రోజుల క్రితం వ్యాపారులను కలిసి, కాస్త వెనక్కి వెళ్లి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కానీ వారు మళ్లీ రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు కొనసాగించడంతో, జెడ్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సిబ్బందితో వచ్చి పోలీసుల సహకారంతో అన్ని షాపులను రోడ్డుకు దూరంగా జరిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిని అతిక్రమించి, ఎవరైనా రోడ్డు పైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, ఎస్‌ఐ భరత్‌కుమార్, పారిశుధ్య అధికారి మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

టీకాలు ఆరోగ్యానికి రక్షణ కవచాలు



మిషన్ ఇంద్ర ధనస్సులో కార్యక్రమలో సచివాలయంలో ఆరోగ్య సిబ్బంది

పీఎం పాలెం: వివిధ రోగాల నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు రక్షణ కవచంగా పని చేస్తాయని పీఎం పాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సుజాన్ పల్లా తెలిపారు. మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి పరిధి లోని 7సచివాలయాల్లో ఆమె పర్యటించారు. టీకాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఆస్పత్రి పరిధిలో టీకాలు వేయించుకోవాల్సిన పిల్లలను గుర్తించామన్నారు. ఎస్‌వో మనోజ్‌కుమార్,ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



వేములవలస ఆర్బీకేలో ఉన్న ఎరువులు

ఆనందపురం: ఖరీఫ్ సీజను ప్రారంభం కావడంతో రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచింది. దీంతో రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకునే ఇక్కట్లు తప్పాయి. మండలంలో 18 రైతు భరోసా కేంద్రాలు ఉండగా, ఖరీఫ్ పనులు ప్రారంభమైన వేములవలస, చందక, బోని, గిడిజాల, వెల్లంకి, ఆనందపురం, గొట్టిపల్లి రైతు భరోసా కేంద్రాలలో 36 టన్నుల యూరియా, 18 టన్నుల డీఏపీ సిద్ధం చేసి ఉంచారు. బస్తా యూరియా రూ.266–50 పైసలకు, డీఏపీ రూ.1350ల చొప్పున విక్రయిస్తున్నారు. వ్యవసాయాధికారి సంధ్యా రత్న ప్రభ మాట్లాడుతూ మిగతా అన్ని రైతు భరోసా కేంద్రాలలోను ఎరువులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆనందపురం: మండలంలోని గుడిలోవ శివారున ఉన్న తోటలో పేకాట ఆడుతున్న ఐదుగుర్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. గుడిలోవలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సీపీ త్రివిక్రమవర్మ, స్పెషల్ బ్రాంచి అధికారులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు వారి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో దాడి చేసి, ఐదుగురి వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.63,900 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆనందపురం పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ముంచేసింది'

మహారాణిపేట: రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం నిట్టనిలువునా ముంచేసిందని టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్ద వెంకన్న అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళనలు చేయాలని కోరారు.

నేటి నుంచి వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు

పద్మనాభం: మండలంలోని మూడు వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి మంగళశారం నుంచి 10వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్టు రిటర్నింగ్ ఆఫీసర్ అరసాడ రఘుపతిరావు తెలిపారు. రెడ్డిపల్లి తొమ్మిదో వార్డు, చిన్నాపురం రెండో వార్డు, బాందేవుపురం పదో వార్డు మెంబర్లకు ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 11న స్క్రూటినీ, 14వ తేదీ వరకు ఉపసంహరణలు ఉంటాయన్నారు.

మందుబాబులకు రూ.75 వేల జరిమానా

పీఎం పాలెం: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడిన మందుబాబులకు న్యాయస్థానం రూ.75వేల 500 జరిమానాగా విధించింది. పీఎం పాలెం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి.. జాతీయ రహదారిపై కొమ్మాది, మారికవలస, కారుషెడ్ కూడళ్లలో పోలీసులు జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 27 మందిని గుర్తించి, కేసు నమోదు చేశారు. వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయల నుంచి ఏడు వేల రూపాయల చొప్పున మొత్తం 75 వేల 500 రూపాయలు ఫైన్ విధించిందని ఎస్‌ఐ తెలిపారు.

'గడప గడపలో..' సమస్యల పరిష్కారం

- చిట్టివలస – గుడివాడ' రహదారి నిర్మాణం
- ఎండాడ జీసీ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అప్పారావు



చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం ముందు సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

తగరపువలస: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా చిట్టివలస–గుడివాడ మార్గంలో శిథిలమైన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఆపై సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యటించినప్పుడు శిథిలమైన ఈ రహదారిని పునరుద్ధరించాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంజూరైన రూ.19 లక్షలతో రహదారిని విస్తరించడంతో పాటు ప్రస్తుతం సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ రహదారి గోతులతో నిండిపోవడంతో వర్షంనీటితో పాటు వసతిగృహం ముందు శిథిలమైన పైపులైన్ ద్వారా వృథా అయిన నీటితో నిండిపోయేది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వీటిని దృష్టిలో పెట్టుకుని కొత్త రోడ్డు వేస్తుండటంతో చుట్టుపక్కల విద్యాసంస్థలలోని విద్యార్థులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీలో రూ.16 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రోడ్డు మరమ్మతులకు కార్పొరేటర్ లొడగల అప్పారావు శంకుస్థాపన చేశారు. గతంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకుని రాగా, ఆయన ఆదేశాల మేరకు ఈ పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, మాదు చంటి, కిల్లంపల్లి రాజు, దాకమర్రి అప్పన్న, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళులు



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఠాగూర్ రచనల గురించి ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు వివరించారు. 1950 జనవరి 24న ఠాగూర్ రచించిన జనగణమనను జాతీయగీతంగా, బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరంను జాతీయగేయంగా ప్రకటించారని చెప్పారు. ఠాగూర్ గీతాంజలి కావ్యానికి నోబెల్ బహుమతి లభించిందని, ఈ పురస్కారాన్ని అందుకున్న మొట్టమొదటి ఆసియావాసి ఆయనే కావడం గర్వకారణమని పేర్కొన్నారు.

రవీంద్రునికి నివాళులు

తగరపువలస: రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా భీమిలి మండలం కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల విద్యార్థులు ఆయన చిత్రపటం వద్ద సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రుడి గురించి ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. ఆయన జీవిత విశేషాలపై విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు.

చేనేత వస్త్రాలు ధరించాలి



చేనేత వస్త్రాలను ధరించి ప్రదర్శిస్తున్న డైట్ అధ్యాపకులు

భీమునిపట్నం: చేనేత వస్త్రాలను అందరూ ధరించాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ కోరారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రాధాన్యత ఉండేదన్నారు. చేనేత వస్త్రాలు ఎంతో అందంగా, సదుపాయంగా ఉంటాయని చెప్పారు.

ప్రస్తుతం చేనేత రంగం ఎన్నో ఇబ్బందుల్లో ఉందని, అందరూ ఎక్కువగా ఈ వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు, ఈ సందర్భంగా పలువురు మహిళా అధ్యాపకులు చేనేత వస్త్రాలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు జె.మాధవి, పి.హరిణి పాల్గొన్నారు.

ఇదేం పని?


- శ్రీవారి ఆలయంలో రాజకీయాలా..?
- అసహనం వ్యక్తం చేసిన భక్తులు



రోడ్డుపై కొబ్బరికాయలు కొడుతున్న పంచకర్ల సందీప్, నాయకులు

కొమ్మాది: కలియుగ వైకుంఠదైవం శ్రీవారి ఆలయంలో సోమవారం జనసేన నాయకులు చేసిన రాజకీయంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయం ఎదురుగా రుషికొండ కొండపై నిర్మిస్తున్న నిర్మాణాలకు వ్యతిరేకంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ఇక్కడ శ్రీవారి ఆలయంలో ఆందోళనలు చేసేందుకు సోమవారం ఉదయం చేరుకున్నారు. పోలీసులు అడ్డుచెప్పడంతో మేము ఆందోళనకు కాదు విశాఖలో ప్రారంభం కానున్న వారాహి యాత్ర విజయవంతం కావాలని పూజలు చేయడానికి ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. అయితే శ్రీవారి ఆలయంలో రాజకీయ పార్టీ సమావేశాలకు అనుమతి లేదని ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. పూజలు నిర్వహించడానికి అయితే ఒక్కసారిగా కార్యకర్తలు, నాయకులు రావాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వాగ్వాదంలో కొంతసేపు దర్శనాలను నిలిపి వేశారు. అక్కడి నుంచి కొండ దిగువ భాగానికి చేరుకున్న నాయకులు ప్రధాన రహదారిపై నినాదాలతో కొబ్బరికాయలు కొట్టి హంగామా చేశారు. దీనితో ప్రయాణికులతో పాటు, భక్తులు అసహనానికి గురయ్యారు. దైవ సన్నిధిలో రాజకీయాలేంటని పలువురు ప్రశ్నించారు. ఈ సందర్భంగా పంచకర్ల సందీప్ మాట్లాడుతూ రుషికొండపై కట్టడాలపై హైకోర్టు అక్రమ కట్టడాలని తీర్పు ఇచ్చిందని, ఇక్కడ ఏ తప్పు జరగకుంటే పోలీసులు అడ్డుకోవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

శిథిలమైన డంపింగ్ యార్డు రహదారి



శిథిలమైన నమ్మివానిపేట డంపింగ్ యార్డు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేట డంపింగ్‌యార్డు రహదారి శిథిలమై అధ్వానంగా తయారైంది. జోన్ పరిధిలో ప్రతిరోజూ పదుల సంఖ్యలో క్లాప్ వాహనాలు ఈ రహదారి మీదుగా డంపింగ్‌యార్డుకు లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వస్తుంటాయి. అలాంటప్పుడు ఎదురెదురుగా వాహనాలు తప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా రహదారి ఛిద్రమైంది. భీమిలి మండలం తాళ్లవలస, జీవీఎంసీ పరిధిలో కుమ్మరిపాలెం , గొల్లలపాలెం గ్రామాలకు ఈ రహదారే దగ్గరగా ఉండటంతో చాలా వరకు ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.